www.prajapakasham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 15 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## రైతాంగాన్ని ఆదుకోండి




-జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
-గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
-రైతు సంఘం నేత బాగం
-రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

2లో

## గూడు కోసం..

# రాజకీయ 'గూడు'పురాణి..!




-కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు
-అసలైన పేదలకు అన్యాయం
-ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు - చక్రం తిప్పుతున్న ఇందిరమ్మ కమిటీలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** గూడు కల్పించేందుకు గ్రామాల్లో పెద్ద గుడుపురాణి చేస్తున్నారు. ఎల్1, ఎల్2, ఎల్3లు ఇక్కడ పనిచేయడం లేదు. స్థానిక నాయకుల అనుచర గణానికి తప్ప అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదన్న వేదన సర్వత్రా వినిపిస్తుంది. ప్రభుత్వ నిబంధనలు లబ్ధిదారుల ఎంపికలో పనిచేయకపోగా అధికారులు కాంగ్రెస్ నాయకులు చెప్పినదానికి తనా తందానా అంటున్నారు. గ్రామాల్లో అధికార, విపక్షం అనే తేడా లేకుండా సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. ఇందిరమ్మ కమిటీలపై స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం యథేచ్ఛగా సాగుతుంది. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇండ్లు నిర్మించేందుకు గాను ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రకటించింది. ఒక్కో ఇంటికి రూ. 5.40 లక్షల చొప్పున మంజూరు చేస్తుంది. ఇంటి నిర్మాణ దశలను బట్టి నగదు మంజూరు చేస్తారు. ఈ క్రమంలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఆర్థిక స్థితిగతులను బట్టి మూడు వర్గాలుగా విభజించారు. ఎల్1, ఎల్2, ఎల్ 3లలో ఎల్1లో ఉన్న లబ్ధిదారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామసభల్లో నిర్ణయించారు. ఎల్1, ఎల్2, ఎల్3లను పక్కనపెట్టి లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ గుడుపురాణి చేస్తున్నారు. స్థానిక నాయకుల అనుచర గణాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నారు. అసలైన పేదలు స్థలం ఉండి ఉండటానికి ఇండ్లు లేని వారికి ఇచ్చేందుకు నానా కొర్రీలు పెడుతున్నారు.

మిగతా 2లో..

ప్రజాపక్షం దినపత్రికకు
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..
ప్రజల గొంతుకగా పనిచేస్తూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా
ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా అక్షరమే ఆయుధంగా
వెలువడుతున్న ప్రజాపక్షం దినపత్రికకు
8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు,
జిపిఓలు, రేషన్ డీలర్లు
చింతకాని మం॥, ఖమ్మం జిల్లా

ప్రజాపక్షం దినపత్రికకు 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..



SCHOOL GAMES CHAMPION
UNIVERSAL VIDYALAYAM
(Recognized by Govt. of Telangana) Nursary to X Class E.M.
Thallada, Khammam Dist. 507 167

# గూడు కోసం రాజకీయ 'గూడు'పురాణి..!



(మొదటిపేజీ తరువాయి)

ఆర్థికంగా స్థితిమంతులై గతంలో ఇండ్లు ఉన్న వారికి కూడా ఇండ్లను మంజూరు చేస్తున్నారు. పేదలు ఎవరైనా ఇందిరమ్మ ఇండ్ల గురించి మాట్లాడితే కాంగ్రెస్ కండువ కప్పుకోవాలంటూ తమ పక్కన తిరగాలంటూ డిమాండ్ చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పార్టీయే ప్రధాన అంశంగా మారింది తప్ప ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికి తోడు స్థానిక నాయకులు కొందరు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో ఇంటికి రూ. 40వేల నుంచి రూ. 60వేల చొప్పున వసూలు చేస్తున్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత కూడా ఇండ్లు మంజూరు కానీ పలువురు ఇప్పుడు స్థానిక నాయకులపై ఫిర్యాదు చేస్తున్నారు. ఇండ్లు మంజూరైతే డబ్బులు నొక్కేయడం, మంజూరు కాకపోతే బాధితులను బెదిరించడం జరుగుతుంది. ఇందిరమ్మ పేదల రాజ్యం ఇందిరమ్మ రాజ్యమంటూ మాటలు చెబుతున్న అమాత్యులు ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో మాత్రం పేదలకు అన్యాయం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వినవస్తున్నాయి. ఇందిరమ్మ కమిటీలు మొత్తం కాంగ్రెస్ నాయకులతోనే ఏర్పాటు చేశారని ఇప్పుడు ఆ కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పేరిట రాజకీయం చేస్తున్నారు. ప్రజా ధనంతో ప్రభుత్వం నిర్వహించే పథకానికి రాజకీయాలతో ముడిపెట్టడం, కండువాలు కప్పుకుంటేనే లబ్ధిదారులుగా ఎంపిక చేయడం ఏమిటన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది.

### ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు :

గ్రామానికి ప్రథమ పౌరుడైన సర్పంచ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో చేష్టలుడిగి చూస్తుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విపక్షాలకు చెందిన సర్పంచులనే కాకుండా అధికార పార్టీ సర్పంచులు కూడా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జోక్యం చేసుకునే పరిస్థితి లేదు. స్థానిక నాయకులే చక్రం తిప్పేస్తున్నారు. ఇటీవల మధిర నియోజక వర్గంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో అధికార పార్టీకి సంబంధించిన సర్పంచ్ పార్టీకి రాజీనామా చేసిన విషయం విధితమే. ఇక విపక్షాలకు చెందిన సర్పంచులనైతే కనీసం ఆహ్వానించడం లేదని ఇది సర్పంచుల హక్కులకు భంగం కలిగించడమేనంటున్నారు. ప్రథమ పౌరున్ని పక్కనపెట్టి రాజకీయాలు ఏమిటన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంది. మొత్తం ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారం రాజకీయ గుడు పురాణికి దారి తీసిన నేపథ్యంలో ప్రభుత్వం తీరును మార్చుకోవాల్సి ఉంది. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యాన్ని నివారించి అసలైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలి. శాసనసభ్యులు ప్రతి గ్రామానికి ఐదు నుంచి 10, 15 లేదా 20 చొప్పున కేటాయిస్తున్నట్లు స్థానిక నాయకులకు తెలియజేయడం స్థానిక నాయకులే లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. వాస్తవానికి ప్రభుత్వ పథకమైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికార యంత్రాంగం చూస్తుండటం తప్ప ఏమి చేయలేని పరిస్థితి. స్థానిక నాయకులు ఎంపిక చేసిన జాబితా నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయడం తప్ప తమకు మరొక పని లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే పేదల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

# రైతాంగాన్ని ఆదుకోండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని ఇప్పుడు పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. రైతాంగాన్ని ఆదుకోవాలని గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం ఒకటని 16 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తెలిపారు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఒక్కో ఎకరానికి పరిహారంగా రూ.30వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని భూగర్భ జల నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలని ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. పొరుగురాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని హేమంతరావు తెలిపారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని, బహిరంగ మార్కెట్‌లో యూరియాతో పాటు ఇతర రసాయనిక ఎరువులను విక్రయించాలని ఆయన డిమాండ్ చేశారు. సన్న వడ్లకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్ధతు ధరను పెంచాలని హేమంతరావు కోరారు. కౌలు రైతులను గుర్తించి పంటలకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి కరువు ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు పశువులకు మేత సరఫరా చేయాలని వరికి ఎకరాకు రూ. 30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా అందించాలని హేమంతరావు కోరారు. ప్రభుత్వం తగు రీతిలో స్పందించక పోతే రైతులను సమీకరించి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు,రైతు సంఘం నాయకులు ఏపూరి లతాదేవి, మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి, వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, దొబ్బల వెంగళరావు, వెన్నం భాస్కర్, మామిళ్ల సుదర్శన్‌రెడ్డి, ఏలూరి భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు అందజేశారు.

# 21 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు : సిపి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు (పోలీస్ ఫ్లాగ్ డే) నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ నిర్వహించటంతో పాటు విద్యార్థులకు సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడం, డ్రగ్స్ రహిత తెలంగాణాలో పోలీసుల పాత్ర వంటి అంశాలలో కేటగిరీల వారిగా వ్యాసరచన, షార్ట్ ఫిలిం, ఫోటోగ్రఫీ పోటీలతో పాటు రక్తధాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, అమరవీరుల కుటుంబాల పరామర్శ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పెరెడ్‌గ్రౌండ్స్‌లో ఈనెల 21న అమరుల స్థూపం వద్ద స్మృతి పెరెడ్, పోలీస్‌ఫ్లాగ్ డే లను నిర్వహించి నివాళులర్పించనున్నట్లు సీపీ తెలిపారు.



# పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి





**ప్రజాపక్షం/కూసుమంచి:** పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ఓటరు నమోదును వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి సూచించారు. కూసుమంచిలో జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి నివాసంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేఖ సత్యనారాయణ యాదవ్‌తో కలిసి ఆయన నాయకులతో సమావేశమయ్యారు. 2023లేదా అంతకంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం 18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, పాత జాబితాలో పేరున్న వారు సైతం మళ్లీ నమోదు కావాలని నాయకులు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి పట్టభద్రులను నమోదు చేయించాలని నెల్లూరి కోటేశ్వరరావు, రేఖ సత్యనారాయణ యాదవ్ కోరారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చందబోయిన పుణ్యవతి, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మంద నవ్య, మంద చంద్రశేఖర్‌గౌడ్, సోమనపల్లి వెంకన్న, పిట్టల వేణు, తదితరులు పాల్గొన్నారు.

# డివైఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఈనెల 24, 25 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరగనున్న డివైఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు తెలిపారు. రాష్ట్ర మహాసభల నేపథ్యంలో తల్లాడ మండల కమిటీ సమావేశాన్ని మేడి బలరాం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న యువత సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ తగిన ఉద్యోగాలు లేక నిరుద్యోగ సమస్యతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. యువతకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విద్యా, వైద్య రంగాలను ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకు రావాలని వారు డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణమే తగు చర్యలు చేపట్టాలని కోరారు. యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసి ఈ మహాసభల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వంగూరి సుందర్‌రావు, మహేష్, లక్ష్మి నారాయణ, నవీన్, ఉపేందర్ నాయక్, లక్ష్మి నాయక్ పాల్గొన్నారు.

# వెంకటగిరిలో డ్రైనేజీ పూడికతీత పనులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో జేసిబి యంత్రం ద్వారా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను బుధవారం చేపట్టారు. సర్పంచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా నేత జక్కంపూడి కిషోర్ చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# వరి పంటను పరిశీలించిన కెవికె శాస్త్రవేత్త, ఏవో



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో కెవికె శాస్త్రవేత్త పావని, వ్యవసాయ అధికారి తాజుద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారి రవి రైతులతో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో బాక్టీరియా ఎండు ఆకు తెగులు లక్షణాలు, ఇతర వ్యాధుల గుర్తింపు, పురుగుల నివారణ చర్యలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటల్లో తెగుళ్లు, వ్యాధుల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పురుగుల మందులు, తెగుళ్ల నివారణ మందులను అవసరమైనప్పుడు మాత్రమే సిఫారసు చేసిన మోతాదులో ఉపయోగించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం గ్రామ రైతులు పాల్గొని పంటల సాగు, తెగుళ్ల నివారణ, యాసంగి పంటల ఎంపికపై వ్యవసాయ అధికారుల నుంచి సూచనలు పొందారు.

# వేంసూరును కరువు మండలంగా ప్రకటించాలి

**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**

**ప్రజాపక్షం/వేంసూరు:** వేంసూర మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వేంసూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన సహాయ సహకారాలు అందించాలని ఆయన



కోరారు. ఆయనతోపాటు లింగపాలెం సర్పంచ్ ఎర్ర రమేష్, లచ్చన్న గూడెం సర్పంచ్ చక్రధర్ రావు,దిద్దుపూడి ఉపసర్పంచ్ మోరంపూడి శ్రీధర్ బాబు ,దొడ్డా వెంకటకృష్ణారెడ్డి మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.










## జమలాపురంలో ఘనంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ మహాచండీ దేవీ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. . ఉదయం 5గంటల నుంచి నిత్య అర్చనలు, అనుస్థానములు, హోమాలు, మండపారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్ శర్మ, మూర్తి వెంకటరమణ, రఘురామకృష్ణ శాస్త్రి, రాజీవ్ శర్మ, వేద పండితులు, ఇతర ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పిఆర్‌టియూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెల్లంకి నాగరాజు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పిఆర్‌టియూ టిఎస్) ఖమ్మం జిల్లా నూతన కోర్ కమిటీలో ఎర్రుపాలెం మండలానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయ నాయకులు వెల్లంకి నాగరాజు ఏకగ్రీవంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గత 16ఏళ్లుగా సంఘంలో నిబద్ధతతో పనిచేస్తూ ఆరేళ్లపాటు ఎర్రుపాలెం మండల అధ్యక్షుడిగా అనంతరం జిల్లా కార్యదర్శిగా సేవలందించిన నాగరాజు ఎన్నిక పట్ల ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆయనను ఎర్రుపాలెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొగ్గుల మదన్‌మోహన్‌రెడ్డి, మారపాక బాబురావు అభినందించారు. తన సదీర్ఘ సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన పిఆర్‌టియూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా రాజశేఖర్, ఆర్.రంగారావుతో పాటు జిల్లా, మండల నాయకత్వానికి ఉపాధ్యాయ మిత్రులందరికీ వెల్లంకి నాగరాజు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.









# రీ సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం



**అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/చింతకాని :** ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రక్రియన పకడ్బందీగా నిర్వహించి భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్రస్థాయిలో భూ హక్కుదారి తో పాటు సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రిసర్వే కార్యక్రమానికి సహకారం అందించాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి వివరాలను గ్రామపంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డులో ఉంచుతామని , అభ్యంతరాలకు గడువు ఇస్తామని అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి కరుణ శ్రీ, సర్వే అధికారులు, జీపీవోలు , రైతులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కులను అణచివేస్తున్న కేంద్రం

**సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**




**ప్రజాపక్షం/పెనుబల్లిః** భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు విమర్శించారు. పెనుబల్లి సిపిఎం కార్యాలయం లో సిపిఎం మండల కమిటీ సమావేశం బుధవారం నల్లమల అరుణ ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించే హక్కు, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు, శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజాస్వామిక శక్తులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనుల ఆందోళనలను అణచి వేస్తుందని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రజాస్వామ్య నిరసనలకు చారిత్రక వేదికగా నిలిచిందని, ప్రజల సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకు రావడంలో ఇటువంటి ఉద్యమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శాంతియుత నిరసనలకు ప్రజాస్వామ్యంలో తగిన అవకాశం కల్పించాలని, ప్రజల గొంతుకను అణచివేయకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాది నేని రమేష్, మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు చెమట విశ్వనాథం, చిట్టి మొదల కృష్ణయ్య, మిట్టపల్లి నాగమణి, కండ సత్యం, తడికమళ్ళ చిరంజీవి, భూక్య ప్రసాద్, అప్పారావు, రామచంద్ర, చలమాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వైరా అభివృద్ధికి రూ.100కోట్ల నిధులు

**-ఇప్పటికే రూ.52కోట్లు.. త్వరలో మరో రూ.50కోట్లు**
**-అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని, ఇప్పటికే రూ.52కోట్లు నిధులు మంజూరయ్యాయ ని, త్వరలో మరో రూ.50కోట్లు నిధులు రానున్నాయని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బుధవారం వైరా తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలిసిన అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఇప్పటికే మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, మిగిలిన పనులకు కూడా వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వైరా పట్టణంలో గ్రంథాలయ నిర్మాణానికి ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్ సురేష్‌ను ఆదేశించారు. వైరాలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన పనులను ఆలస్యం కాకుండా చూడాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యాటక అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ఇతర అభివృద్ధి పనులు కూడా సమాంతరంగా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబర్‌లో పనులు ప్రారంభించే దిశగా టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు వైరా పట్టణ అభివృద్ధికి ప్రభుత నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, తహశీల్దార్ సురేష్, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, పలువురు అధికారులు, నాయకులు, కాపా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు యశోదమ్మ మృతి

**నివాళులర్పించిన తుంబూరు దయాకర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 4వ వార్డు జలగంనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మ(68) గుండె పోటుతో తన నివాసంలో మంగళవారం మృతి చెందారు. బుధవారం మరణ వార్త తెలుసుకున్న మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి యశోదమ్మ పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తరుపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యశోదమ్మ మృతి కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సుడా చైర్మన్ పువ్వాల దుర్గా ప్రసాద్, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్, కౌన్సిలర్లు బోయిన కుమారిసంగయ్య, బానాత్ దివ్య,పుల్‌చంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టిపిసిసి ప్రచార కమిటీ నెంబర్ ధరావత్ రామ్మూర్తి నాయక్, మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు కందుకూరి వెంకటనారాయణ, బోయిన సాయి, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటు నమోదు



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని బుధవారం చింతకాని మండల కేంద్రంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా సురేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గ్రాడ్యుయేట్‌ల ఓటరు నమోదు తప్పనిసరి అని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా గడల శ్రీనివాసరావు పోటీచేయనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో జనసేన బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మధిర కోఆర్డినేటర్ తాళ్లూరి డేవిడ్, మండల నాయకులు చింతాల నరేష్, జొన్నలగడ్డ భద్ర , ఎస్ భరత్, టి రామకృష్ణ, తాళ్లూరి అవినాష్, అలవాల రాంబాబు, చింతాల వెంకటేష్, విష్ణు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# 14నెలల చిన్నారి మృతి

**- చికిత్స పొందుతుండగానే ఫిట్స్, బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఆ చిన్నారి నవ్వులతో ఆ ఇంట్లో ఎప్పుడూ సంతోషమే...బుడిబుడి అడుగులతో ఇల్లంతా కలియతిరుగుతూ తల్లిదండ్రుల కళ్లలో ఆనందాన్ని నింపేది. అందుకు తగ్గట్టుగానే తల్లిదండ్రులు ముద్దుగా హ్యాపీ అని పేరుపెట్టుకొని, హ్యాపీగా జీవిస్తుండగా చిన్న జ్వరం ఆ చిన్నారిని కానరాని లోకాలకు తీసుకెళ్లింది. ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన బానోత్ సునీల్‌అంజలి దంపతులకు హ్యాపీ(14) అని కుమార్తె ఉంది. జ్వరం రావడంతో రెండురోజుల క్రితం చిన్నారిని ఖమ్మంలోని అంకురా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో పాటు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్యులు చికిత్స అందిచినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇలా మంగళవారం సాయంత్రం చిన్నారి తుదిశ్వాస విడిచింది. కళ్లముందే ఆడుతూ పాడుతూ తిరిగిన బిడ్డ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చిన్నారి మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిర :** మధిర తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మధిర మండలం తొండల గోపవరం గ్రామపంచాయతీ పరిధిలో తొర్లపాడు గ్రామానికి చెందిన కాశిబోయిన మహేశ్వరికి రూ.100116లు చెక్కును మధిర మండల కాంగ్రేస్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, గ్రామ సర్పంచ్ షేక్ కన్నం సాహెబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పారుపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు పేద మధ్యతరగతి కుటుంబాల అప్పుల బాధ నుండి విముక్తి కలిగించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ చెక్కులు రావడానికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# బస్ సర్వీస్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/మధిరః** మధిర మండల పరిధిలోని మల్లారం, రొంపిమల్ల, జాలిముడి, రామచంద్రపురం గ్రామాల మీదుగా నెమలి–వైరా వరకు బస్ సర్వీస్‌ను ప్రారంబించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మదిర డిపో సూపరిండెంట్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మధిర మండలం పరిధిలోని మల్లారం, రొంపిమల్ల, జాలిముడి, రామచంద్రపురం గ్రామాలకు బస్ సర్వీస్ లేకపోవడం వలన స్కూల్ పిల్లలు, కాలేజి విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ పరిసర ప్రాంత ప్రజలకు విద్యార్థులు రవాణా సౌకర్యం కోసం బస్ సర్వీస్‌ను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌వైఎఫ్ మండల కార్యదర్శి సంపసాల సాయి, మండల నాయకులు నాగుల, వెంకటకృష్ణ, గోపి, మోహన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# మంగళగౌరీగా దర్శనమిచ్చిన వాసవి మాత



**ప్రజాపక్షం/మధిరః** మధిర వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వాసవి మాతను మంగళగౌరీదేవి అలంకారంలో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీనివాసులు శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వించగా, శర్మ ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. అనంతరం సుహాసినులకు విద్యా సామాగ్రిని అందజేశారు. అమ్మవారి నామస్మరణలు, భక్తిపారవశ్యంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాతిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ఆర్యవైశ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.

# రూ.8.10 కోట్ల ధాన్యం లెక్కలపై అనుమానాలు..!



**-మల్లేపల్లి దక్షిణామూర్తి రైస్ ఇండస్ట్రీస్‌పై ఆరోపణలు**
**-ఐకేపీ ధాన్యం నిల్వలపై సందేహాలు, అధికారుల తనిఖీలతోనే స్పష్టత**

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం మల్లేపల్లిలోని దక్షిణామైర్తి రైస్ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన సుమారు 8.10కోట్ల విలువైన ధాన్యం లావాదేవీలపై ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఐకేపీ ద్వారా సేకరించిన ధాన్యం నిల్వలు, లెక్కల్లో వ్యత్యాసాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూసుమంచి, నేలకొండపల్లి ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లు, నిల్వల వివరాలపై భిన్నమైన సమాచారం వస్తున్నట్లు తెలుస్తోంది. నేలకొండపల్లిలోని దుర్గాభవాని రైస్ మిల్లులో నిల్వల ప్రస్తావన ఉండగా, ఇతర వివరాలపై ఆరా తీసినప్పుడు కూసుమంచిలో నిల్వలు ఉన్నట్లు చెబుతున్నారనే సమాచారం ఉంది. అయితే, వాస్తవ నిల్వలు, రికార్డుల్లోని లెక్కల మధ్య వ్యత్యాసాలున్నాయా అన్నది అధికారుల తనిఖీలతో తేలాల్సి ఉంది.

### సివిల్ సప్లైస్ ఫిర్యాదుతో దర్యాప్తు...?

సివిల్ సప్లైస్ శాఖ డీటీ విజయబాబు ఫిర్యాదు మేరకు, మిల్లును లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న తోట వీరభద్రరావు కోసం కూసుమంచి పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. కేసు వివరాలు, వర్తింపజేసిన చట్టపరమైన సెక్షన్లు, పోలీసుల అధికారిక ప్రకటనపై స్వతంత్ర నిర్ధారణ అవసరం, వీరభద్రరావు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారనే సమాచారం కూడా ప్రచారంలో ఉంది. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు డీటీ విజయబాబును సంప్రదించగా స్పందన లభించలేదు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు కేటాయింపులు, నిల్వలు, బియ్యం అప్పగింతల వివరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. రూ 8.10 కోట్లకు సంబంధించిన ఆరోపణల్లో వాస్తవాలు, ప్రభుత్వానికి నష్టం జరిగిందా లేదా, బాధ్యులెవరనే అంశాలు అధికారిక దర్యాప్తుతోనే స్పష్టమవుతాయి.

## సెంట్రల్ యూనివర్సిటీలో మేఘనకు నాలుగు బంగారు పతకాలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకు చెందిన తాటిరెడ్డి గోవిందరెడ్డి, ధనలక్ష్మి దంపతుల కుమార్తె మేఘన కాంతి ప్రియ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసి నాలుగు బంగారు పతకాలు సాధించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, యూనివర్సిటీ ఉప కులపతి జె అనురాధ చేతుల మీదుగా ఆమె పతకాలు అందుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మేఘన తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ మేఘన సాధించిన విజయం సారపాక, మోరంపల్లిబంజర్‌తో పాటు మండలానికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. మేఘన తండ్రి గోవిందరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటికి నుంచే చదువులో ప్రతిభ కనబరిచిన తన కుమార్తెను సివిల్ సర్వీసెస్ సాధించి ప్రజలకు సేవ చేసేలా ప్రోత్సహించామని తెలిపారు. ఆమె సాధించిన విజయాలు తమ కుటుంబానికి ఎంతో సంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల అధ్యక్షుడు బి సాయిశ్రీను, మండల ఇన్‌చార్జి



ముసుగు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాలునాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు దివ్యశ్రీ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రహీం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చుక్కపల్లి బాలాజీ, కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, దుప్పటి సురేష్, మండల ప్రధాన కార్యదర్శులు వెలిశెట్టి రామారావు, దుర్గాల వెంకటేశ్వర్లు, బీఎంఎస్ నాయకులు వైవీ, ఓరుగంటి సురేష్, నంద్రు నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లి పశువైద్యశాలకు తాళం..!



**-వైద్యాధికారి ఆంధ్రకు..అసిస్టెంట్ ఖమ్మంకు!**
**-సిబ్బంది గైర్హాజరుతో వైద్య సేవలకు ఆటంకం?**
**-ఫోటోలు తీస్తే మీడియాపై గోపాలమిత్ర ఆగ్రహం**

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. బుధవారం వైద్యాధికారి ఇందిరా డెయిరీకి చెందిన గేదెల ఎంపిక కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా, వెటర్నరీ అసిస్టెంట్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఖమ్మం వెళ్లినట్లు సమాచారం. దీంతో పశువైద్యశాలకు తాళం పడటంతో వైద్య సేవల కోసం వచ్చే పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

### ఫోటోలు తీస్తే ఆగ్రహం...

తాళం వేసిన కార్యాలయాన్ని మీడియా ప్రతినిధులు ఫోటోలు తీస్తుండగా గోపాలమిత్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిబ్బంది భోజనానికి వెళ్లారని చెప్పిన అనంతరం కార్యాలయాన్ని తెరిచినట్లు సమాచారం. సిబ్బంది అందుబాటులో లేని సమయంలో కార్యాలయ నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### పర్యవేక్షణ ఏది..?

ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోతే పశువులకు అత్యవసర వైద్యం అందడంలో ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. విధుల నిర్వహణ, కార్యాలయం మూసి ఉన్న వ్యవధిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, పశుపోషకులకు నిరంతర వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# ఆపదలో ఉన్నవారికి అండగా ప్రజా ప్రభుత్వం

**రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం**

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం సుందరయ్య నగర్‌కు చెందిన దొమ్మేటి ఏడుకొండలుకు వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ని బుధవారం పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్య చికిత్స పొందేందుకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన



వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు ఏదైనా ఆపద ఎదురైనప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, చిట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్‌లో కేజీబీవీ విద్యార్థినికిస్టేట్ సెకండ్ ప్రైజ్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల కేంద్రానికి చెందిన కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కాకా ప్రవీణ లక్ష్మి రెజ్లింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించి తన ప్రతిభను చాటుకుంది. వివరాల్లోకి వెళ్లితే నారాయణపేట్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు ఈనెల 10 నుంచి 13 వరకు జరిగాయి. చంద్రుగొండ కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహం)కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కాకా ప్రవీణ లక్ష్మి రెజ్లింగ్ అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ రజని, ఎంఈఓ సూరయ్య, ఎంపీడీవో అశోక్, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.

## కొమరం భీమ్ విగ్రహ ఏర్పాట్లు పరిశీలన



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం మరిదిములకపాడు జంక్షన్‌లో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆదివాసీల ఆరాధ్య దైవం, పోరాట యోధుడు కొమరం భీమ్ విగ్రహ నిర్మాణ పనులను తహసీల్దార్ ఎం అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈనెల 22న విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విగ్రహం పక్కన నిర్మిస్తున్న షెడ్ పనులను కూడా పరిశీలించిన తహసీల్దార్, ఈ ప్రాంత ప్రయాణికులకు, ప్రజలకు ఉపయోగపడేలా మంచి కార్యక్రమం చేపట్టారని నిర్వాహకులను అభినందించారు. విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించడంతో పాటు శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ అశోక్ కుమార్‌ను, డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబును విగ్రహావిష్కరణకు ఆహ్వానిస్తూ ఐక్య కార్యాచరణ వేదిక నాయకులు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో వేదిక గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర్‌రావు, కన్వీనర్ కుంజ శ్రీనివాసరావు, ఆదివాసీ నాయకులు సోయం కామరాజు, తెల్లం హరికృష్ణ, సొంది మల్లుదొర, సర్పంచులు కురసం రవి, పోడియం సుబ్బారావు, నాయకులు తునికి కామేశ్వరరావు, పెనుబల్లి చంటి, కోయ నరసాపురం గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ సీనియర్ సభ్యుడు పుల్లయ్య మృతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ సభ్యుడు పొలంపల్లి పుల్లయ్య (75) బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు గ్రామ శాఖ సభ్యులతో కలిసి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కనకబండి సీతారాములు పార్టీ నాయకులతో కలిసి పుల్లయ్య భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఏఐటీయూసీ ఆర్టీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపాక వెంకట్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, సహాయ కార్యదర్శులు భద్రజీ వెంకటేశ్వరరావు, బాలెబోయిన వెంకన్న, ఉప సర్పంచ్ ఆలేటి ఉమామహేష్, గ్రామ పెద్దలు పొలంపల్లి వెంకట్, పిచ్చయ్య, కనకబండి రామయ్య, మరికంటి రమేష్, గండు సైదులు, పెద్దపాక వెంకటి, పొలంపల్లి వీరేష్‌తో పాటు గ్రామ శాఖ సభ్యులు నివాళులర్పించారు.

## సింగరేణి కార్మికుల లాభాల వాటాపై కోత ఎందుకు?

**- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్**




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సింగరేణి కార్మికుల కష్టార్జితానికి న్యాయమైన వాటా కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, వాస్తవ లాభాలను వెల్లడించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ విమర్శించారు. సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పందించకుంటే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి వాస్తవ లాభాలను వెల్లడించకుండా కేవలం రూ.1,754 కోట్ల లాభాలను మాత్రమే ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ఏడాది కార్మికులకు ప్రకటించిన 34 శాతం లాభాల వాటానే ఈ ఏడాది కూడా కొనసాగించడం ద్వారా కార్మికులకు అదనంగా ఒక్క శాతం కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలను పక్కపెట్టి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో మాత్రమే చర్చించి లాభాల వాటాను ప్రకటించడం కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రధాన్యమిచ్చినట్లుగా ఉందని విమర్శించారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా లాభాల వాటాను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, పిట్ కార్యదర్శులు నరేష్, కమల్, నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**- పనులు పరిశీలించిన మేయర్ మూడ్ గణేష్**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పట్టణ పరిధిలో చేపట్టిన మురుగు నీటి కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొత్తగూడెం పట్టణంలోని రామవరం ఏరియా 15,16 డి ఇవిజన్ల పరిధిలో జాతీయ రహదారి వెంట సుమారు రూ.40 లక్షల నిధులతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను బుధవారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పర్యవేక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రధాన రహదారితోపాటు సమీప కాల నీలు జలమయం కాకుండా ముందస్తు చర్యగా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా సాంకేతిక ప్రమాణాల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. నిర్ణీత గడువు లోగా పనులు పూర్తిచేసి ప్రజలు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతలోపిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు. స్థానికుల నుండి సమస్యలు అడిగి తెలుసుకుని డ్రైనేజ్ వల్ల ఇళ్లలోకి నీరు చేరకుండా సమగ్ర ప్రణాళికతో పనులు జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 16వ డివిజన్ కార్పొరేటర్ పద్మ, 14వ డి విజన్ కార్పొరేటర్ సుధాకర్, 17వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు

**అర్హులకు ఇంటి పట్టాల పంపిణీ చేసిన పినపాక ఎమ్మెల్యే**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, పట్టాల పంపిణీ ద్వారా వారి సొంతింటి కలను నిజం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, నిరుపేద కుటుంబాలకు గృహ భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కలగడంతో పాటు వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పినపాక నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలకు కంకరతో తాత్కాలిక మరమ్మతులు




**-ప్రజాపక్షం కథనానికి స్పందించిన అధికారులు**

**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజల పక్షాన నిలిచిన ప్రజాపక్షం వార్తకు అధికారులు స్పందించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని కూసుమంచి, తురకగూడెం పంచాయితీ రాజ్ రహదారి దుస్థితిపై బుధవారం ప్రచురించిన వార్తకు స్పందనగా, రోడ్డుపై గుంతలు ఏర్పడిన ప్రాంతంలో అధికారులు కంకర పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవలే ఈ రహదారిపై కల్వర్టు కుంగిపోవడంతో పాటు రహదారి దెబ్బతినడం వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజాపక్షం వార్త ద్వారా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనంపై స్పందించిన పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుంతలు పడిన ప్రాంతంలో కంకర పోయించడంతో వాహనదారులకు కొంత ఉపశమనం లభించింది. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వార్తా కథనం తన పాత్రను పోషించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టొద్దు...**

ప్రస్తుతం కంకర పోయించడం ఉపశమనం కలిగించినప్పటికీ, రహదారి శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కల్వర్టు కుంగిపోయిన ప్రాంతాన్ని సాంకేతికంగా పరిశీలించి, అవసరమైన నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం గొంతెత్తుతూ, సమస్యల పరిష్కారమయ్యే వరకు ప్రజల పక్షాన నిలవడమే ప్రజాపక్షం లక్ష్యం. రహదారి సమస్యపై అధికారుల స్పందన స్వాగతించదగినదే అయినప్పటికీ, పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# కొట్టెం బుచ్చక్క మృతి న్యూడెమోక్రసీకి తీరని లోటు



**ప్రజాపక్షం/ఇల్లందు:** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకురాలు కొట్టెం బుచ్చక్క అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందారు. గురువారం ఆమె పార్థివదేహంపై ఎర్ర జెండా కప్పి పార్టీ నాయకులు నివాళులర్పించారు. సంతాపసభలో జిల్లా నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాదలపల్లి సత్యం, ఖమ్మం జిల్లా నాయకుడు ప్రకాష్ మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన బుచ్చక్క, చల్లాసముద్రం పంచాయితీ అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. చేనకలగడ్డ ఆశ్రమ హాస్టల్ ఏర్పాటు, మహిళా హక్కుల సాధన కోసం పోరాడారని, రెండుసార్లు ఎంపీటీసీగా ప్రజలకు నిస్వార్థ సేవలందించారని గుర్తుచేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోతిలాల్, అనిల్‌రెడ్డి, దొంతు లక్ష్మయ్య, కాంపాటి కోటేశ్వరరావు, కోయిల శ్రీను, మాజీ సర్పంచ్ వేప వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శినిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక బస్టాండ్ సమీపం లోని ప్రియదర్శినీ డిగ్రీ, పిజి కాలేజీలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు ఒకొరికి ఒకరు పోటీగా భారీగా బతుకమ్మలు తయారు చేసి ఆటపాటలతో కళాశాల ఆవరణను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన షీ టీమ్ ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో భాగంగా బతుకమ్మకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించిన సిబ్బందిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డా.కాటేపల్లి నవీన్‌బాబు ప్రిన్సిపల్ డా. నయూమ్ పాషా, వైస్ ప్రిన్సిపల్ రాయల వివేక్ పిడి కాశిమల్ల రమేష్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# క్లీన్ మణుగూరుగా మార్చే వరకు ఉద్యమం ఆగదు

**పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా**



**ప్రజాపక్షం/మణుగూరు:** క్లీన్ మణుగూరుగా మార్చే వరకు ఉద్యమం ఆగదని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం మణుగూరు రోడ్లపై వస్తున్న దుమ్ము ధూళిని తొలగించాలని, దుమ్ము లేచే ప్రదేశంలో నీటిని చల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు పట్టణంలో ఒకపక్క ఇసుక లారీలు, మరోపక్క బొగ్గు లారీలు, మరోపక్క గుట్ట మల్లారంలో ఇసుక లారీలు పోయేందుకు ఏర్పాటు చేసిన రోడ్ల పై విపరీతమైన దుమ్మూధూళి వస్తుందన్నారు. ఈ దుమ్మూధూళి వల్ల ప్రజలు రోడ్ల మీదకు రావాలంటే భయపడుతున్నారని, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుమ్మూధూళి రాకుండా నీళ్లు చల్లించాలని అడిగితే తమపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పామాయిల్ తోటపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేయిస్తావంటూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రేగా కాంతారావు ప్రశ్నలు సంధించారు. తుమ్మలచెరువులో కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్న 50 ఎకరాల భూమిలో అటవీ భూమి ఎంత ? ప్రభుత్వ భూమి ఎంత ? అనే విషయాల పై బహిరంగంగా చర్చించేందుకు నువ్వు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇద్దరి ఆస్తుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి, వారసత్వంగా వచ్చిన ఆస్తులు, సంపాదించిన ఆస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచుదామన్నారు. మోరంపల్లి బంజర, దుమ్ముగూడెం, హైదరాబాద్‌లోని భూముల వివరాలపైనా చర్చిద్దామన్నారు. మణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల విక్రయాలు, ఆక్రమణల ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ వారంలో ఆరు ఎకరాల భూమికి పట్టా కోసం దరఖాస్తు చేసిన అంశాన్ని కూడా తేల్చుకుందామన్నారు. విజయనగరం ప్రాంతంలో సింగరేణి భూములకు సంబంధించి బినామీ పేర్లతో జరిగినట్లు ఆరోపిస్తున్న వ్యవహారాలు, గిరిజన ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశాల పై తన వద్ద వివరాలు ఉన్నాయని, ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు. దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో నిజాయితీని నిరూపించుకుందామని పాయంకు సవాల్ విసిరారు. ఎప్పుడు, ఎక్కడ, ఏ మీడియా సమక్షంలో చర్చించాలో నిర్ణయించుకునే అవకాశం పాయంకే ఇస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాళ్లపాయలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం తాళ్లపాయ గ్రామ పంచాయితీలోని తాళ్లపాయ గ్రామంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగపేట ఆధ్వర్యంలో క్షయ వ్యాధి(టీబీ)నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఊపిరితిత్తుల సమస్యలు, దీర్ఘకాలిక దగ్గుతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో అందుబాటులో ఉన్న ఎక్స్‌రే యంత్రం ద్వారా మొత్తం 53 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యుడు డాక్టర్ సాయి కళ్యాణ్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల సమస్యలు, దగ్గు ఉన్న వారు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్ల వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించి, జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. శిబిరంలో స్థానిక సర్పంచ్ గద్దం సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోడ బుల్లి మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం



**ప్రజాపక్షం/ఇల్లందు:** బేతంపూడి గ్రామ పంచాయితీ పరిధిలోని వెంకట్యతండాకు చెందిన బోడ హేమ్లా భార్య బోడ బుల్లి మృతి పట్ల ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఉమా మృతురాలి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గామాత మండపం వద్ద మహా అన్నదానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీప శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ అలంకరణల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తుండగా, ప్రత్యేక పూజలు, అర్చనలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# వైరా అభివృద్ధిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**-వెయ్యి మంది విద్యార్థులకు సరిపడేలా పాఠశాల భవన నిర్మాణ నమూనా**
**-రిజర్వాయర్ వద్ద రోడ్లు, తీగల వంతెన ప్రతిపాదనలు**
**-ఆక్రమణలపై సర్వేకు ఆదేశం**







**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం పరిశీలించారు. పట్టణంలో విద్యా సదుపాయాల విస్తరణ, పర్యాటక అభివృద్ధి, రహదారుల నిర్మాణం, ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధనకు అనువుగా, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలకు అవసరమైన సదుపాయాలతో సుమారు వెయ్యి మంది విద్యార్థులకు సరిపడేలా భవన నిర్మాణ నమూనా రూపొందిచంఆలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీలోని 13వ వార్డులో ఉన్న గుట్టబడి భవనానికి పాత డిజైన్‌ను కొనసాగిస్తూ రీమోడలింగ్ చేపట్టాలని, వెనుక భాగంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం వైరా రిజర్వాయర్‌ను సందర్శించిన కలెక్టర్‌కు అధికారులు, రింగు రోడ్డు నుంచి రిజర్వాయర్ మీదుగా తల్లాడకు అనుసంధానించే రహదారి నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను చూపించారు. రిజర్వాయర్ పరిసరాల్లోని రెండు గుట్టల మధ్య తీగల వంతెన నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే ప్రాంతీయ రవాణా, పర్యాటక అభివృద్ధికి సంబంధించిన అవకాశాలను పరిశీలించేందుకు వీలుటుంది. అనంతరం ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పునాదుల వద్ద మట్టి నింపేందుకు అవసరమైన మట్టి అందుబాటులో లేకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించినట్లు తెలిసింది. మట్టి తరలింపునకు కొణిజర్ల తహశీల్దార్‌కు గతంలోనే సూచించినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని అరుణను ఫోన్‌లో ప్రశ్నిస్తూ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులకు ఆటంకాలు తొలగించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైరా తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలెక్టర్ దివాకర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని, వైరా రిజర్వాయర్ పక్కన ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో సమగ్ర సర్వే నిర్వహించాలని తహశీల్దార్ సురేష్‌ను ఆదేశించారు. సర్వే అనంతరం ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు నిబంధనలకు అనుగుణంగా అవసరమైన స్థలాన్ని మున్సిపాలిటీకి కేటాయించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే అవకాశబూలను పరిశీలించాలని సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేస్తానని పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, తహశీల్దార్ సురేష్, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, విద్యాశాఖ అధికారులు, నాయకులు కాపా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ధన్యవాదాలు తెలిపిన క్రీడాకారులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడలో వాలీబాల్ క్రీడా మైదానానికి సంబంధించి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి లకు తల్లాడ వాలీబాల్ క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. వాలీబాల్ క్రీడా ప్రాంగణం పక్కన చిన్న వాటర్ ట్యాంక్ ఉండడంతో దానిని పగలగొట్టడం జరిగింది. మరల దానిని యథావిధిగా వాటర్ ట్యాంక్ కట్టిస్తామని సర్పంచ్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ క్రీడా ప్రాంగణానికి తొలి నుంచి ఉన్న చల్లా వెంకట్ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఈ విషయాన్ని తెలియజేశారు. క్రీడాకారులను గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దారవత్ కృష్ణ, ఉపేందర్, గ్రౌండ్ ఇంచార్జి మహారాజ్, మొక్క సైదులు, పెరిక శ్రీను, యాసిన్ పాషా, తోట సంపత్, శివ, అజయ్, శ్రీరామ్, ఉపేందర్, రవితేజ, చక్రవర్తి, నవీన్‌లు ఉన్నారు.

# సాంబయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది



**ప్రజాపక్షం/తల్లాడ :** మండలంలోని అంజనాపురం గ్రా మానికి చెందిన సిపి ఎం పార్టీ సభ్యుడు పాలనాటి సాంబ య్య మృతిచెందిన విషయం తెలుసుకున్న సిపిఎం పార్టీ జిల్లా నాయకత్వం ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించింది. సాంబయ్య మృతిపట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే సిపిఎం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదినేని రమేష్, మాచర్ల భారతి, మండల కార్యదర్శి రామలింగేశ్వర రావు, కృష్ణయ్య, ప్రకాష్‌రావు, రమేష్, కృష్ణయ్య ఉన్నారు.

# రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షునిగా వెంకటనారాయణ రెడ్డి

**-మండల అధ్యక్షులుగా లక్ష్మి రెడ్డి**





**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం జిల్లా రెడ్డి జాగృతి అధ్యక్షులుగా తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకట నారాయణ రెడ్డి ని నియమించారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెం మాధవరెడ్డి ఆదేశాల మేరకు వ్యవస్థాపక సభ్యులు నిరుడు దయాకర్ రెడ్డి నియామక ప్రకటన చేశారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా రెడ్డి జాగృతి యూత్ అధ్యక్షులుగా తల్లాడ నారాయణపురం గ్రామానికి చెందిన గొడుగునూరి రవీందర్‌రెడ్డి, తల్లాడ మండల అధ్యక్షులుగా గొడుగునూరి లక్ష్మి రెడ్డి లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటితం సాధికారత సమానత్వం కోసం కృషి చేస్తామన్నారు. రెడ్డికులం హక్కుల కోసం పోరాడతామన్నారు. రెడ్డి జాగృతి సంఘంలో మూడు ముఖ్యమైన పదవులు తల్లాడ నారాయణపురం గ్రామానికి చెందిన వారికి వరించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను రఘునాథపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని శ్రీశ్రీశ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో ఛైర్మన్ మందా బుచ్చిబాబు ఆధ్వర్యంలో సంబురాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఐదవ రోజు అట్ల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి మహిళలంతా సంప్రదాయ వస్త్రాలను ధరించి బతుకమ్మల చుట్టూ ఆడుతూ పాడుతూ సందడి చేశారు.ఈ కార్యక్రమంలో చావా సరోజిని, తన్నీరు శ్రీనివాసరావు, సిరిపురపు సత్యబాబు, జంగాల నర్సింహారావు, కన్నెటి పూర్ణయ్య, తక్కెళ్లపాటి లక్ష్మి, అక్కి వెంకటేశ్వర్లు, బోడా నాగేశ్వరరావు, తాళ్లూరి శ్రీమన్నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీరాంరావుకు చంద్రావతి నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ రెవెన్యూ అధికారి మాటేటి శ్రీరాంరావుకు మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి నివాళులర్పించారు. నమస్తే తెలంగాణ బ్యూరో చీఫ్ మాటేటి వేణుగోపాల్ తండ్రి మాటేటి శ్రీరాంరావు ఇటీవల మృతిచెందిన విషయం విధితమే. బుధవారం వేణుగోపాల్ కుటుంబాన్ని చంద్రావతి పరామర్శించి శ్రీరాంరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# పువ్వాడ నగర్‌లో ఇంటింటా సర్వే



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీలో ఇంటింటా సర్వే నిర్వహించారు. 2009, 2016లో సర్వే నెం.192లో ప్రభుత్వం 2వేల మందికి పట్టాలు ఇచ్చింది. కొంత మంది ఇండ్లను కూడా నిర్మించుకున్నారు. స్థలాలు కేటాయించిన ప్రాంతాన్ని పువ్వాడ నగర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అక్కడ ఇండ్ల స్థలాల విక్రయాలపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో అక్కడి పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రాథమిక సర్వే చేపట్టారు. బుధవారం ఏడు బృందాల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఒక్కో బృందంలో జిపివో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పట్టాదారులు ఇల్లు నిర్మించుకున్నారా, పట్టాదారుల నుంచి ఇతరులు కొనుగోలు చేసి ఉంటున్నారా వంటి ఇతరత్రా వివరాలను సేకరించారు. ఆర్ఐలు సర్వే బృందాలను పర్యవేక్షించారు. ఈ సర్వేను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బాధిత కుటుంబానికి గ్రానైట్ మార్కర్ యూనియన్ అండగా నిలిచింది. యూనియన్ సభ్యుడైన రామ్మూర్తి ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ సభ్యులు యూనియన్ నుంచి రామ్మూర్తి కుటుంబానికి ఐదువేల ఆర్థిక సాయం అందించారు. దీనితో పాటు యూనియన్ ఉపాధ్యక్షులు పాషా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. రామ్మూర్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారులు నరేంద్ర, వెంపటి వెంకటేశ్వర్లు, ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్ పాషా, ప్రెసిడెంట్ కిషన్ పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించండి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేద ప్రజలు ఏమీ కొనలేని స్థితి ఏర్పడిందని తక్షణం నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. 30వ డివిజన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా బతుకు భారమైన నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మరిన్ని ఇబ్బందులను తెచ్చిపెడుతుందన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించడంలో విఫలమైందన్నారు. తక్షణం ధరల తగ్గింపుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు నూనె శశిధర్, భూక్యా రవీంధర్, ముజామిల్, సాయి పాల్గొన్నారు.

# రేపు ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**-వివిధ రంగాల ప్రముఖులకు సన్మానం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 16న జరగనుంది. 70 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఈ కళాశాల ఎందరినో ఉన్నత శిఖరాలకు చేర్చింది. లక్షలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించి అనేక రంగాల్లో అత్యున్నత స్థానాలకు చేరారు. విద్య, వ్యాపార, శాస్త్ర సాంకేతిక, పరిశోధన, వైద్య రంగాలలో నిష్ణాతులుగా నిలిచారు. వీరిలో కొంత మందిని వివిధ రంగాలకు చెందిన వారిని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా సన్మానించనున్నట్లు నిర్వాహణ కమిటీ బాధ్యులు నల్లమోతు తిరుమలరావు తెలిపారు. వీరిలో కొండబాల కోటేశ్వరరావు, నల్లగట్ల స్వామిదాస్, మాధవరెడ్డి, మహ్మద్ ముజఫర్ ఉద్దీన్, జహీర్ అలీ, నర్సింహారావు, జర్నలిస్టులు చిన్న నర్సయ్య, భూపాల్ తోపాటు పలువురు న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల బాధ్యులను సన్మానించనున్నారు.